

7,8లో..

## విరామమెరుగని విజయ భానుడు

- సిబ్బందే ఆయన బలగం
- తెలంగాణ ఉద్యమంలో సకల జనులకు తోడునీడ
- ఆర్టీసీ ఆస్తుల రక్షణకు ప్రత్యేక వ్యూహ రచన
- సీమాంధ్ర పాలకులకు చుక్కలు చూపిన నేర్పరి..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 17
పేజీలు : 09 | వెల: రూ.5/-
గురువారం
సెప్టెంబర్ 26, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ

నివాళులు అర్పించిన మేయర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు



9లో..

## నిర్ణయాధికారం వారిదే

అడవిబిడ్డల అభివృద్ధికి సహకరించాలి

పెసా V/s ఫారెస్టు అన్నట్లు వ్యవహరించొద్దు

జాతీయ సదస్సులో మంత్రి సీతక్క



9లో..

## రోజుకో ప్రకటన

- అయోమయంలో ఆశావాహులు
- కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు
- తొలుత సెప్టెంబర్ 17, తర్వాత అక్టోబర్ 2 నుంచి అంటూ ప్రచారం
- తాజాగా డిజిటల్ కార్డులంటూ ప్రకటన

2లో..

# మందు కావాలా బాబూ..

**పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం**

**ఎనీటైం మందు లభ్యం**

**సహకరిస్తున్న ఎక్సైజ్ శాఖ**


**మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు**

పరకాల నియోజకవర్గం మందుబాబులకు స్వర్గధామంగా మారింది. గల్లీకి ఒకటి..వాడకు రెండు లేదా మూడు చొప్పున వెలసిన బెల్ట్ షాపులతో ఆయా ప్రాంతాలు కుటీర పరిశ్రమలను తలపిస్తున్నాయి. పేరుకు అవి కిరాణ షాపుల్లాగా కనిపించినా అక్కడ అమ్మేదంతా మద్యమే. అయితే దుకాణదారులు సమయపాలన పాటిస్తుంటే..బెల్ట్ షాపుల్లో మాత్రం ఎనీటైం మందు అందుబాటులో ఉంటుంది. కొన్ని బెల్ట్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. బల్లాలు, కుర్చీలు వేసి మందు కావాలా బాబూ..అన్నట్లుగా స్వాగతం పలుకుతున్నాయి. అక్కడ మందుతో పాటు చికెన్ కర్రి, బాయిల్డ్ ఎగ్, గుడాలు, బోటి, తలకాయ కూరను స్పెషల్ ఆఫర్లుగా అందిస్తున్నారు. అయితే స్థానికంగా ఉన్న వైన్ షాపులనుంచే పెద్ద మొత్తంలో బెల్ట్ షాపులకు మద్యం సరఫరా అవుతోందన్న ప్రచారం సాగుతోంది. వైన్ షాపులు కొనుగోలు చేసిన మద్యంలో సగానికిపైగానే ఆటోల ద్వారా యథేచ్ఛగా బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. ఇందుకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది సైతం పూర్తి సహాయ సహకారాలు అందించడం గమనార్హం. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు పూర్తిగా ఉద్యోగ ధర్మాన్నే మరిచి వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

–వరంగల్ వాయిస్, పరకాల

వివరాలు2లో..

### కుటీర పరిశ్రమగా బెల్ట్ షాపులు





## అక్రెడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ (గుర్తింపు కార్డు) గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీతో అక్రెడిటేషన్ కార్డుల గడువు ముగిసిపోతుంది. పలు కారణాల వల్ల ఈ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఐఅండ్ పీఆర్ అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు అక్రెడిటేషన్ గడువును పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలిపారు.

– వరంగల్ వాయిస్, హైదరాబాద్

# మందు కావాలా బాబూ..




- కుటీర పరిశ్రమగా బెల్ట్ షాపులు
- పేరుకు కిరాణం.. అమ్మేది మద్యం
- ఎనీటైం మందు లభ్యం
- సహకరిస్తున్న ఎక్సైజ్ శాఖ
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజకవర్గం పరిధిలోని పరకాల, నడికూడ మండలాల్లో కుటీర పరిశ్రమను తలపించేలా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో గ్రామంలో జనాభాను అనుసరించి ఐదు నుంచి 15 వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో గల్లీకో బెల్టు షాప్ ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. నడికూడ, పరకాలలో మొత్తం 24 గ్రామ పంచాయతీలుండగా సుమారు 150కి పైగా బెల్ట్ షాపులు 24/7 పనిచేస్తున్నాయి. మండల కేంద్రాల్లో రాత్రి సమయాల్లో మద్యం కావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోగాని గ్రామాల్లో మాత్రం ఏ బెల్ట్ షాప్ తలుపు తట్టినా ఎంత కావాలంటే అంత లభిస్తోంది.

### పేరుకు కిరాణం..

మండలంలోని పలు గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కిరాణ దుకాణాల్లో నిత్యావసరాలకు బదులుగా మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిడ్జ్ పెట్టుకొని మరీ మద్యం విక్రయిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా అభిస్తున్న మద్యంతో యువత చిత్తైపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పచ్చని సంసారంలో మద్యం చిచ్చు పెడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొద్దంతా కష్టపడి సంపాదించిన సొమ్మును మద్యం దుకాణంలోనే ఖర్చు చేయడంతో అనేక కుటుంబాలు తినేందుకు తిండి లేక వీధిన పడే పరిస్థితి నెలకొందంటున్నారు. మద్యం మత్తులో రాత్రి పొద్దుపోయేవరకు నానా రభస చేయడం, ఇంటికి చేరుకొని భార్యాభర్తల గొడవలు జరుగడం సర్వసాధారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### క్వాటర్ కు రూ.30..





పల్లెల్లో మారుమూల గ్రామంలో యువత రాత్రి పగలు తేడా లేకుండా మత్తులో జోగుతున్నాయి. అప్పులు చేసి తాగడంతో కాపురాలు వీధిపాలవుతున్నాయి. క్వాటర్ పై రూ.30, హాఫ్ పై రూ.50, ఫుల్ పై రూ.80, బీర్ పై రూ.40 అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రతి ఒక్క గ్రామంలో వీధి వీధికి బెల్ట్ షాపులు వెలవటంతో మందుకు కొదవ లేకుండా ఉన్నాయి. ధర ఎంతైనా పర్వాలేదు అన్నట్లుగా మద్యం ప్రియుల వ్యవహారం సాగుతోంది. దీంతో బెల్ట్ షాప్ నిర్వాహకులు బిల్డింగులు కడుతుంటే మద్యం ప్రియులు బికారులవుతున్నారు.

### పట్టించుకోని ఎక్సైజ్ శాఖ..

గల్లీ గల్లీలో మద్యం ఏరులై పారుతున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బెల్ట్ షాపుల నిర్వహణతో రిటైల్ మద్యం షాపుల యజమానులకు అడ్డగోలుగా లాభాలు వస్తుంటే, మందుబాబుల చేబులకు చిల్లి పడుతోంది. వైన్ షాప్ యజమానులే ఆటోల్లో మద్యాన్ని తరలిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్ట్ షాపులతో రోడ్డు పాలవుతున్న కటుంబాలు కనిపించకపోవడం శోచనీయం. మహిళల మెడలో పవిత్రంగా ఉండాల్సిన తాలిబొట్లు బెల్ట్ షాపు యజమానుల వద్ద తాకట్టుకు వస్తున్నా ఎక్సైజ్ అధికారులు స్పందించకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళల కన్నీటిని తుడిచేవారు కరువయ్యారని మదన పడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తు నుంచి తేరుకొని కనీస ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని, పేదల కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాలని పలువురు కోరుకుంటున్నారు.

# తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ

### నివాళులు అర్పించిన మేయర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భూమి కోసం, భుక్తికోసం, రజాకార్లపై రైతంగా సాయుధ పోరాటాలు చేసి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచినా తెలంగాణ వీరానారి చాకలి ఐలమ్మ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను గురువారం 31వ డివిజన్ పద్మాక్షి రోడ్డులో ఘనంగా నిర్వహించారు. నాటి రజాకార్ల పాలనలో అణగారిని వర్గాల ప్రజలకు, రైతులకు తన పోరాట పటిమ ద్వారా ఎదురొడ్డిన చాకలి ఐలమ్మ నేటి తరానికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మామిండ్ల రాజు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్, ఎంపి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అంటూ కొనియాడారు.

### పోలీస్ కమిషనరేట్ లో..



చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కమిషనరేట్ పరిపాలన విభాగం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్యఅతిథిగా పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, రవీందర్ తో పాటు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఆర్ఐ, ఇన్స్ స్పెక్టర్లు పరిపాలన విభాగం అధికారులు, సిబ్బందితో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఎమ్మెల్యే నాయిని రవీందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని సుమన్ టీవీ కార్యాలయం సమావేశం మందిరంలో కాకతీయ జర్నలిస్టు హౌసింగ్ కోపరేటివ్ సొసైటీ 28వ వార్షికోత్సవం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 28 సంవత్సరాల చరిత్ర కలిగిన కాకతీయ జర్నలిస్ట్ హౌసింగ్ కోపరేటివ్ సొసైటీ సభ్యులంతా తన విద్యార్థి రాజకీయాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే పదవి వరకు సుపరిచితులేనని అన్నారు. త్వరలోనే జర్నలిస్టులు శుభవార్త వింటారన్నారు. ఈ సందర్భంగా కాకతీయ జర్నలిస్టు హౌసింగ్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ సహకారంతో పాటుగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృషితో సభ్యుల సాకారం నెరవేరబోతోందని సభ్యుల కరతాళధ్వనుల మధ్య వివరించారు. అనంతరం కార్యదర్శి సోమ నర్సయ్య, డైరెక్టర్ పి.వేణు మాధవరావు, మాజీ కార్యదర్శి మదన్ మోహన్, సభ్యులు భాస్కరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్ బాబు, డైరెక్టర్ దయాసాగర్, సభ్యులు రవీంద్రరావు, అచ్చుత రఘునాథ్, కె.కుమారస్వామి, వహీద్ గుల్షన్, ఫిరోజ్ ఖాన్, రవీందర్ రెడ్డి, జలీల్, బి.శ్రీనివాస్, కె.వసంత్ కుమార్, కె.నరసింహ రాములు, పూర్ణ చందర్, టి.నరేందర్, చేతన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, కె.రమేష్, కె.మనోజ్ తదితరలు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులపై అధికారుల దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలోని పలు రైస్ మిల్లులపై రాష్ట్ర సివిల్ సప్లైస్, టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రూ. 24 కోట్ల 55 లక్షల 33 వేల సీఎంఆర్ ధాన్యాన్ని మాయం చేసిన ముగ్గురు రైస్ మిల్లుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ మాట్లాడుతూ ఖరీఫ్, రబీలలో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) జిల్లాలోని పలు మిల్లులకు కేటాయించగా, బియ్యాన్ని అప్పజెప్పని మిల్లులపై ఈ దాడులు నిర్వహిస్తున్నామని, ఈ దాడుల్లో విస్తుబోయే నిజాలు బయటపడుతున్నాయ, రైస్ మిల్లుల్లో సరిపోయే వరి ధాన్యం నిలువలు ఉండటం లేదని, ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లుల యజమానులపై రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకోవడమే కాకుండా వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ టాస్క్ ఫోర్స్ దాడులు నిరంతరం కొనసాగిస్తామన్నారు. హబూబాబాద్ పట్టణంలోని శ్రీనివాస ఇండస్ట్రీస్ రా...పారా బాయిల్డ్ రైస్ మిల్లులో దాడులు కొనసాగిస్తున్నామని, ఇప్పటి వరకు 20 వేల క్వింటాళ్ల ధాన్యం గుర్తించామని, ఇంకా లెక్కింపు జరుగుతుందని, లెక్కింపు పూర్తి అయినా తర్వాత పూర్తి వివరాలు వెల్లడి స్తామన్నారు. ఈ దాడుల్లో అధికారులు కృష్ణవేణి, ప్రేమ్ కుమార్, రమేష్, టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన పున్నం చందర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 5 డివిజన్ నుంచి డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో మాజీ చీఫ్ విప్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆశీస్సులతో మాజీ మంత్రి కేటీఆర్ ను బుధవారం బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ తెలంగాణ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పండుగ సాగర్, కానగంటి అరవింద్, మూల ప్రభాకర్, తాడిశెట్టి రాము, ప్రభాకర్, దాసరి సమ్మన్న, రవి కృష్ణ, చౌదరి నారాయణగిరి, రాజు, రమేష్, ముఖ్య నాయకులు కార్యకర్తలు కలిసన వారిలో ఉన్నారు.

## సాయిబాబా మందిరంలో రావు పద్మ పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సాయిబాబా మందిరంలో గురువారం భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. మందిర పూజారులు మణిశర్మ, చందులు అష్టోత్తర పూజలు నిర్వహించి ఆశీర్వదించగా మందిర ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో బాబా శేష వస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

# ఎల్కతుర్తి-సిద్దిపేట హైవే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోండి

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** నాసిరకం పనులు చేపడుతున్న ఎల్కతుర్తి-సిద్ధిపేట హైవే నిర్మాణ కాంట్రాక్టర్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల సీపీఐ నాయకులతో కలిసి హైవే నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామం వద్ద ప్రధాన రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎల్కతుర్తి-సిద్దిపేట హైవే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకం కంకర, ఇతర సామాగ్రి వినియోగిస్తూ నాణ్యతను పాటించడం లేదన్నారు. తద్వారా రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందే ధ్వంసం అవుతున్నదన్నారు. కాంట్రాక్టు పనులు దక్కించుకొని నెలలు గడుస్తున్నా పనులు సకాలంలో పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని, తద్వారా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. రోడ్డుపై కంకర తేలి, దుమ్ము, దూళీతో సమీప గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ఈ హైవేపై ఓవర్ లోడ్ వాహనాలు నియాంత్రిచాలని, రోడ్డు సకాలంలో పూర్తి కాకపోవడంతో నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. నాసిరకం పనులు నిర్వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు కాంట్రాక్టర్ ను ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఊటుకూరి రాములు, కర్రె లక్ష్మణ్, సీనియర్ నాయకులు సిరబోయిన కరుణాకర్, మోతె లింగారెడ్డి, మునిగాల భిక్షపతి, మంచాల రమాదేవి, కె.వెంకటరమణ, కొట్టెపాక రవి, శంకర్ నాయక్, మంచాల తిరుపతి, మర్రి విజయ్, గడ్డం రాజనర్సు, మార్పు కృష్ణారెడ్డి, నిమ్మల మనోహర్, బత్తిని సదానందం, రావుల తిరుపతి, టేకుమట్ల కుమారస్వామి, శనిగరం రాజ్ కుమార్, పంతనం స్వామి, మార్పు సంజీవరెడ్డి, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంచార్జి ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన లింగారెడ్డి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల ఇంచార్జి ఎంఈఓగా గాయపు లింగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండల నోడల్ ఆఫీసర్ లుగా విధుల నిర్వర్తిస్తున్న వారిని ఇంచార్జి ఎంఈవోలుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మేరకు గురువారం ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ మేరకు మండల విద్యా వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీ సిబ్బంది శాలువాతో సత్కరించి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, ఏంఐఎస్ కోఆర్డినేటర్, శిల్ప, సీఓ జయరాజ్, సీఆర్పీలు ప్రవీణ్, రజిత, శ్రీనివాస్, సుధ, లోకేష్, సంధ్య పాల్గొన్నారు.

## బార్ షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అదేశాల మేరకు హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని డబ్బాలు జంక్షన్ వద్ద గల శ్రీ రామ బార్ అండ్ రెస్టారెంట్ లో నిబంధనలకు విరుద్ధంగా గురువారం ఉదయం 5.30 గంటల సమయానికే బార్ అండ్ రెస్టారెంట్ తెరిచి మద్యం విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో రామ బార్ షాపుపై టాస్క్‌ఫోర్స్, హనుమ కొండ పోలీసులు దాడులు చేశారు. కౌంటర్ పై ఉన్న మాచర్ల శ్రీనివాస్, ఓనర్ రవీందర్ లను, రూ.3,890 విలువ గల మద్యాన్ని, కౌంటర్ లో గల ఉదయం నుంచి మద్యం విక్రయాలు చేసిన రూ.3,650 స్వాధీన పర్చుకొని విచారణ నిమిత్తం హనుమకొండ పోలీసులకు అప్పగించారు. ఈ అక్రమ మద్యం అమ్మకాలు పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్, ఎస్సై శరత్, టాస్క్‌ఫోర్స్ టీంని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్ అభినందించారు.

# 30న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్ టీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని బుధవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో ఐఎఫ్ టీయూ న్యూ డెమోక్రసీ నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఇందిరాపార్క్ వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.అనూరాధ, వి.కృష్ణల అధ్యక్షతన జరుగుతుందని, వక్తలుగా ప్రొఫెసర్ హరగోపాల్, ఐఎఫ్ టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బూర్గుల ప్రదీప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఆర్.జనార్ధన్, ఎండీ రాసోద్దీన్ లు మాట్లాడతారని వారు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని మండిపడ్డారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఉండదని చెప్పిన బీజేపీ ప్రభుత్వం నేడు వాటిని ప్రైవేటు వర్గాలకు అప్పగిస్తున్నదని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల హక్కులను కాల రాసిందని మండిపడ్డారు. అలాగే ఇటీవల తీసుకువచ్చిన పౌరుల స్వేచ్ఛను ప్రశ్నించే గొంతులను, సంస్థల ఉద్యమాలను అణచివేసే మూడు క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, ఐఎఫ్ టీయూ నాయకులు ఇనుముల కృష్ణ, ఎండీ అక్బర్, పుప్పాల రాజేందర్, హరిబాబు, భాషపాక అశోక్, రంజిత్, రాజేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రైతంగా పోరాట యోధురాలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం రాంనగర్ ఆఫీస్ లో కల్లేపల్లి బాబు అధ్యక్షతన వీరనారి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల కుమారస్వామి మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ జీవిత విధానం నేటి యువతకు పెద్దగా స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా నిలబడి, అణగారిన రైతులకు ధైర్యం, స్ఫూర్తినిచ్చిన ఆమె సాహసం, ధైర్యం తెలుగు నేలలో నిత్య చిరస్థాయని అన్నారు. ఐలమ్మ తన పోరాటంతో ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి, అన్యాయాలను ఎదుర్కొన్న ఆమె నాయకత్వం ప్రతి వర్గానికి ఆదర్శమన్నారు. ఐలమ్మ చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ఆమె ఆశయాలను మనందరం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో పాల్గొనడానికి ముందుకొచ్చిన ప్రతి సభ్యుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిప్పు కణిక చాకలి ఐలమ్మ



**వరంగల్ వాయిస్ నడికూడ :** భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక, తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 129 వ జయంతి సందర్భంగా గురువారం నడికూడ రజక సంఘం ఆధ్వర్యంలో రజక కమిటీ హాల్ లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక సంఘాల సమితి రాష్ట్ర కో కన్వీనర్ దురిశెట్టి చంద్రమౌళి (చందు), రజక సంఘం గ్రామ అధ్యక్షుడు దురిశెట్టి రాజయ్య, ఉపాధ్యక్షుల గొల్లపెల్లి మహేందర్, కోశాధికారి పోచనపల్లి వెంకటేష్, గౌరవ అధ్యక్షులు వైనాల సారయ్య, ఉప్పుల సాయిలు, నాయకులు కుడ్ల మహలాల్ రావు, గోనెల శరత్, తల్లా నవీన్, రజక సంఘం నాయకులు రవి, చంద్రమౌళి, సంపత్, సంతోష్, కుమారస్వామి, ఐలయ్య, వీరస్వామి, సంపత్, శ్రీకాంత్, శ్రీనివాస్, లక్ష్మి, కిరణ్, సంతోష్, చంద్రశేఖర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండేటి నరేంద్ర కుమార్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ నిర్వహించిన పోరాటపటిమను కొనియాడారు. వనిత చాకలి ఐలమ్మ విస్నూర్ దేశ్ ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి గూండాలను కొంగును నడుముకు చుట్టి కొడవలి చేత బట్టి తరిమికొట్టారు. తెలంగాణ తొలి దశ స్వాతంత్ర పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ బసవరాజు శిరీష శ్రీమాన్, 20వవిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తత్తరి లక్ష్మణ్, తోట బాలరాజు, వెల్దండి లక్ష్మణ్, మార్త అంజయ్య, కొడాలి బాబు, వేణు, రాజుశంకర్, ఎల్లయ్య, నెల్లుట్ల కుమార్, స్వప్న, సామల కుమార్, దాసరి రాజు, గుండేటి శ్యామ్, గుండేటి సతీష్, దూపం సంపత్, గోరంట్ల రాజు, గొర్రె ప్రశాంత్, శివ, బూర నటరాజ్ పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ

### అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** శ్రమ దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సామాజిక ఆధునిక పరిమాణానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ కొనియాడారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిలుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొంగు నడుముకు చుట్టి, కొడవలి చేపట్టి నైజాం సర్కార్‌తో పాటు విస్నూర్ దొరల ఆగడాలను ఎదిరించిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నరసింహస్వామి, మునిసిపల్ చైర్మెన్ డాక్టర్ పాల్వాయి రాం మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జీనుగు మరియన్న, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, సీపీఐ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ అజయ్ సారథి, నిమ్మల శ్రీనివాస్, కొలిపాక వెంకన్న, ఉప్పలయ్య, గోపాల్, మామిడాల సత్యనారాయణ, చాగంటి కిషన్, రజక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజన పోరు బిడ్డ చాకలి ఐలమ్మ



**వరంగల్ వాయిస్, కాటారం :** బహుజన పోరు బిడ్డ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కాటారం మండల రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రం గారేపల్లిలో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు పెనుగొండ రాజయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా పోరాటం సాగించిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పైడాకుల సతీష్, పైడాకుల మహేందర్, నడికుట లింగయ్య, మూసాపూర్ ఐలయ్య, కల్లగుంట సురేష్ బాబు, గుండ్లపెల్లి హరీష్, అశోక్, కనుకుల పవన్, పున్నం శంకర్, పెనుగొండ శ్రీను, పున్నం రమేష్, పెనుగొండ రమేష్ తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి అంగరంగ వైభవంగా జయంతి వేడుకలు నిర్వహించారు.

## మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మహిళలందరూ చాకలి ఐలమ్మను ఆదర్శ తీసుకోవాలని వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్దన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పి, మహిళా లోకానికి స్పూర్తినిచ్చిన ధీరవనిత చాకలి ఐలమ్మ వారి జయంతి సందర్భంగా వారికివే మా ఘన నివాళులు అన్నారు. మహిళలందరూ ఐలమ్మను ఆదర్శ తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్, మండల, పట్టణ, గ్రామ స్థాయిల నాయకులకు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## న్యూ లయోలా హైస్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని కుమార్ పల్లిలోని న్యూ లయోలా హైస్కూల్ లో చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ కలిసి చిట్యాల ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కరస్పాండెంట్ క్రాంతి కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 32వ డివిజన్‌లో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అటవీ దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావుల ఆదేశానుసారం బుధవారం 32వ డివిజన్ లో కార్పొరేటర్ పల్లం పద్మా రవి, డివిజన్ అధ్యక్షుడు సందీప్ పటేల్, మాజీ కార్పొరేటర్ కత్తెరసాల వేణుగోపాల్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున చిట్యాల ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి బాచి, బత్తిని రంజిత్, కస్తూరి వంశీ, తిరుపతి, బండి రాజమణి, స్వప్న, లత, అనిల్, శ్రీధర్, నరిగ శ్రీను, సంజయ్ బాబు, గిరి, శోభన్, శివ, రమేష్, బ్రహ్మం, పద్మ, పూసల పద్మ, శ్రీను, రజిత, సతీష్, సునీత, వినీత్, సందీప్, కొండరాజు యాదగిరి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాశిబుగ్గ చౌరస్తాలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కొండా దంపతుల ఆదేశాల మేరకు 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని భాస్కర్, 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కాశిబుగ్గ చౌరస్తా సెంటర్ లో పూలమాల వేసి నివాళు లు అర్పించారు. పండ్ల పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, బట్టు శేషు, నీలం శ్రీను, రాజేష్, పల్లకొండ రాజమణి, సుల్తానా సమ్మక్క, వెంకన్న, సుధాకర్, ఉమేందర్, రాజు, వీరన్న, గంధర్, ప్రసాద్, చందు, కాంగ్రెస్ కార్యకర్తలు, కొండా అభిమానులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

### కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నాయకులు నార్లగిరి రమేష్ అధ్యక్షతన గురువారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. బహుజన పోరుబిడ్డ, నిజాం నియంత్రత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత, ఓరుగల్లు పోరుబిడ్డ అని అన్నారు. దున్నేవాడికి భూమి దక్కాలని, పండించే వాడికే పంట దక్కాలని పోరాడిన ఉద్యమ వీరవనిత ఐలమ్మ అని తెలిపారు. బహుజన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, ఉడుతల సారంగపాణి, డివిజన్ అధ్యక్షులు కనకరాజు, శ్రీనివాస్, హరినాథ్, మోహన్, రాజు, నాయకులు సుంచు కృష్ణ, సల్వాజీ రవీందర్ రావు, పరుశు రాములు, రాజు, శ్రీనివాస్, శ్రీధర్ రావు, జానకిరాములు, రమేష్, అఫ్జల్, దేవి, రామ్మూర్తి, గండ్రకోట రాకేష్ యాదవ్, నగేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 32వ డివిజన్‌లో..



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 32వ డివిజన్ లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకురాలు చిట్యాల ఐలమ్మ జయంతి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షుడు సందీప్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మా రవి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కత్తెరసాల వేణు, నాగపూరి సంజయ్ బాబు, వాణి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ సామల సుధాకర్, నాయకులు బత్తిని రంజిత్, కస్తూరి వంశీ, బండి భాస్కర్, అనిల్, సీనూరి శ్రీనివాస్, నరికే శీను, రామగిరి శోభన్, కొండరాజు, బత్తిని సతీష్, యాదగిరి, బ్రహ్మం, రమేష్, ఉపేందర్, మారపాక శీను, తాళ్లపల్లి శివ, తౌడు మధు, మొగిలి, నీలం విన్ను, బండి రాజమణి, కేదారి పద్మ, స్వప్న, వెలిశాల పద్మ, రమ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## డైనమిక్ స్కూల్ అవార్డుకు ఎంపికైన మేధా కాన్సెప్ట్ స్కూల్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఈ న్యూస్ నెట్ వర్క్ వాళ్ళు కంప్యూటర్ ఎడ్యుకేషన్ విభాగంలో నిర్వహించే డైనమిక్ స్కూల్ అవార్డు 2023-24 సంవత్సరానికి గాను హనుమకొండ జిల్లా కాజీపేటలోని మేధా కాన్సెప్ట్ స్కూల్ ఎంపికైంది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ డా.వి.మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని స్కూళ్లను ఈ అవార్డు ఎంపిక చేశారన్నారు. ఈ అవార్డు ను హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఈ న్యూస్ నెట్ వర్క్ నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నామన్నారు. అవార్డు ఎంపికతో విద్యార్థులలో సృజనాత్మకత, బోధన మరింత అందించే బాధ్యత పెరిగిందని డైరెక్టర్ మధుకర్ రెడ్డి తెలిపారు.

## బక్కి నాగమ్మకు మరుపల్లి రవి నివాళి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు బక్కి నాగమ్మ (102) ఉర్సు ప్రతాప్ నగర్ లోని తన స్వ గృహంలో గత నాలుగు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ రాత్రి మృతి చెందింది. ఈమెకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు, అయిదుగురు కోడల్లు 15 మంది మనుమలు, మనవరాల్లు ఉన్నారు. బక్కి నాగమ్మ మరణ వార్త విని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహాన్ని దర్శించి పూలదండ వేసి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇప్పటికీ ప్రభుత్వం తరఫున పెన్షన్ పొందుతుంది.

# గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** భూమి కోసం.. భుక్తి కోసం.. బానిస సంకెళ్ల విముక్తి కోసం జరిగిన పోరాటంలో నిప్పుకణికగా నిలిచి ఆడది అబల కాదు సబల అని నిరూపించిన వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనలో మగ్గుతున్న తెలంగాణలో తొలి భూ పోరాటానికి, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆమె తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు. తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని ప్రతీ ఒక్కరూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, బీసీ సంఘ నాయకులు, సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ ఆశయాల సాధనకు పోరాడాలి

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ పోరాట స్ఫూర్తిని ప్రపంచానికే చాటిన వీరనారి చిట్యాల(చాకలి) ఐలమ్మ ధైర్య సాహసాలు మరువరానివని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఆమె జయంతి సందర్భంగా గురువారం కొత్తవాడలో ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ నిరంకుశ పాలకులకు, భూస్వామ్య దోపిడీ పెత్తందారీ వర్గాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ నిప్పు కణిక అన్నారు. ఆమె చేసిన విప్లవోద్యమ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. దొరలు భూస్వామ్య గుండాలు ఎన్ని దాడులు చేసిన, అక్రమ కేసులు బనాయించిన, చిత్రహింసలు పెట్టిన చలించక ఇబ్బందులను మొక్కవోని ధైర్యంతో వీరోచితంగా ఎదిరించిన విప్లవ వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. నేటికి భూమి సమస్య, ఉపాధి సమస్య పరిష్కరించబడలేదని, సమాజంలో కుల వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, రాజ్యాధికారంలో న్యాయమైన వాటా కోసం ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని బడుగు బలహీనవర్గాల వారు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామల రమేష్, పెద్దారపు కుమార్ స్వామి, లింగబత్తిని రామకృష్ణ, రాజేంద్ర చారి, బొద్దుల పవన్, మాదాసి కరుణాకర్, షేక్ హఫీజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గురువారం సాయంత్రం భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీ, పోలీస్ స్టేషన్ రోడ్డు, ఎమ్మార్వో రోడ్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఫేజ్-5 కింద సుమారు రూ.140 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జడ్పీ సీఈఓ, జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపనలు చేశారు. రూ.30 లక్షలతో కారల్ మార్క్స్ కాలనీలో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, రూ.50 లక్షలతో పోలీస్ స్టేషన్ రోడ్డులో రోడ్డుకిరువైపులా సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చివరగా, రూ.60 లక్షలతో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం నుండి ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డులో బీటీ రోడ్డు వైడనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ తో పాటు, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. సదరు గుత్తేదారు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట పలువురు అధికారులు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## టీజీఎన్పీడీసీఎల్ ఆఫీస్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్), విద్యుత్ భవన్, కార్పొరేట్ కార్యాలయంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఇంచార్జి డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, మధుసూదన్ వీరనారి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రస్థానం ఒక శక్తివంతమైన అధ్యాయమని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం అహర్నిశలు పోరాడారని, భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ఆమె దార్శనిక నాయకత్వం అందరినీ ఆదర్శప్రాయంగా నిలిచేలా చేసిందన్నారు. చాకలి ఐలమ్మ ధైర్యం, త్యాగం, సంకల్పం ఈ తరం యువతకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్ ఫైనాన్స్ వి.తిరుపతి రెడ్డి, ఇంచార్జి డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, కె.కిషన్, రవీంద్రనాథ్, కేఎన్ గుట్ట, జాయింట్ సెక్రటరీ రమేష్, డీఈ కె.అనిల్ కుమార్, శ్రీధరాచారి, ఏఎస్ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

## కేయూ ప్రొఫెసర్స్ వెంకయ్య, నారాయణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ అభివృద్ధికి ప్రధాన ఆటకంగా మారిన కుల, మత, లింగ ఆర్థిక అసమానతులను కూకటి వేళ్లతో కదిలించివేసి దోపిడి పీడనలు లేని సమానత్వ సమాజ స్థాపనకు నేటి విద్యార్థులు అంతా శాస్త్రీయ దృక్పథంతో కూడిన ప్రశ్నించే తత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను అలవర్చుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్స్ డాక్టర్ వై.వెంకయ్య, డాక్టర్ ఈసం నారాయణలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీడీఎస్ యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ కామర్స్ సెమినార్ హాల్ లో జిల్లా అధ్యక్షుడు అలవాల నరేష్ అధ్యక్షతన జరిగింది. దీనికంటే ముందు కేయూ మొదటి గేటు నుంచి రెండవ గేటు వరకు భారీ విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. ఈ 50 వసంతాల స్వర్ణోత్సవ సభలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కేయూ ప్రొఫెసర్స్ డాక్టర్ వై. వెంకయ్య, డాక్టర్ ఈసం నారాయణలు మాట్లాడుతూ నేటి విద్యార్థి యువతలో ప్రగతిశీల భావాలు లోపించటం వలన విదేశీ పాశ్చాత్య సంస్కృతికి గురవుతూ, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, ధూమపానం, మద్యపానం లాంటి దురాలవాట్లకు గురై విలువైన నిండు జీవితాలను నాశనం చేసుకుంటూ కన్న తల్లిదండ్రులకు, సమాజానికి తీరని శోకాన్ని మిగిల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభ ప్రారంభానికి ముందు పీడీఎస్ యూ. విప్లవ విద్యార్థి వీరులైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీ పాద శ్రీహరి, బొమ్మ సాంబయ్య, కోలా శంకర్, దుస్స చేరాలు, రంగవల్లి, మధుసూదన్ రాజ్, వరహాలు, రమణయ్య, చాంద్ పాషా, మారోజు వీరన్న లాంటి విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కంపాటి పృథ్వీ, పీడీఎస్ యూ పూర్వ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవి, రాష్ట్ర నాయకులు ముల్క రవి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు, జిల్లా నాయకులు వినయ్, వంశీ, హర్ష, రవి, రాజు, అజాహర్, కేయూ నాయకులు అశోక్, నరేష్, పృథ్వీరాజ్, అనూష, సంగీత, స్వాతి పాల్గొని ప్రసంగించారు.

## బిట్స్ అష్మాక విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** జిల్లా స్థాయి సైన్స్ మేళాలో బిట్స్ అష్మాక హై స్కూల్ విద్యార్థులు కలెక్టర్ ప్రశంసలు పొందారు. యువజన, క్రీడాశాఖ జిల్లా స్థాయి సైన్సు మేళాను స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఇందులో బిట్స్ అష్మాక హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులు ఈ.కీర్తన, ఎం.కీర్తన, గైడ్ టీచర్ పి.మనోహర్ ఆధ్వర్యంలో అవాయిడింగ్ క్రిమినల్ ఆక్టివిటీస్ విత్ ద హెల్ప్ ఆఫ్ సెన్సార్ అనే అంశంపై ఎగ్జిబిట్ ను ప్రదర్శించడం జరిగింది. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్.సత్య శారద విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ ను ప్రశంసించారు.

## బీజేపీ మండల ఉపాధ్యక్షుడికి నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** రూరల్ మండలం మలకపేట గ్రామానికి చెందిన బీజేపీ మండల ఉపాధ్యక్షులు రంగు రాజేందర్ గుండెపోటుతో మరణించారు. బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పరామర్శించి తన వంతు సహాయం అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పుట్ట రవీందర్, దుమల నగేష్, కసగాని రాజ్ కుమార్, దయ్యాల దేవరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25 నుంచి అక్టోబర్ 1 వరకు వృద్ధుల కార్యక్రమాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం వరంగల్ లోని వివిధ వృద్ధాశ్రమాలయందు వృద్ధులకు సాంస్కృతి కార్యక్రమాలు ఆటలు, పాటలు, పొడుపు కథలు, సామెతల పోటీలు నిర్వహించారు. గొర్రెకుంటలోని ఆనందశ్రయ వృద్ధాశ్రమమునందు నిర్వాహకులు యాదగిరి సమక్షంలో ఆటలు పోటీ నిర్వహించగా, కర్ర సాము పోటీలో మాధవరావు (102) వృద్ధుడు కర్ర సాము చేసి అలరించారు. పాటల పోటీలలో నిర్మల, జయప్రద, యాదగిరి, రామయ్య ప్రథమ, దితీయ బహుమతులు పొందారు. ఎలగందుల వృద్ధాశ్రమం, సాయి హెూం వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. 45 మంది మహిళలు, 35 మంది పురుషులు మొత్తం 80 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా సంక్షేమ వరంగల్ సమక్షంలో నిర్వహింపబడగా సీనియర్ అసిస్టెంట్ అరుణ, సీనియర్ సిటిజన్ జిల్లా కమిటీ సభ్యులు హేమలక్క, కె.మల్లారెడ్డి, ఏ.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ వారోత్సవాల్లో భాగంగా రేపు ఉదయం 8 గంటలకు వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ వరకు వాక్ మారథాన్ ఉంటుందని, ప్ల కార్డ్స్ తో ప్రదర్శన జరుగుతుందని, నగరంలోని వయోవృద్ధులు భారీగా హాజరు కావాలని వరంగల్ జిల్లా సంక్షేమ అధికారి పిలుపునిచ్చారు.

## ఉల్లిగడ్డ ధరలు తగ్గించాలని సీపీఐ నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పెరిగిన ఉల్లిగడ్డ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ సెంటర్ లో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన జరిగిన నిరసన ధర్నా కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. ఎన్నడూ లేని విధంగా పెరిగిన ఉల్లిగడ్డ ధరలు పేద ప్రజలకు పెను భారంగా మారాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఉల్లిగడ్డ సహా ఇతర వస్తువుల ధరలు తగ్గించని అని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకాలు, పికెటింగులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె బాష్ మియా, కార్యవర్గ సభ్యులు గుండె భద్రి, గన్నారపు రమేష్, సీపీఐ సీనియర్ నాయకులు ఎండీ ఖాసీం, కండె నర్సయ్య, జన్ను రవి, పరికరాల రమేష్, ఎండీ అంజాద్, దస్రూ, మేడిది అశోక్, అరె రాజు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి బచ్చల స్వప్న, మండల నాయకులు కొయ్యడ మనోహర్, యారా మల్లయ్య, మసెకె సుధీర్, సుప్రియ, వసంత, భార్గవి పాల్గొన్నారు.

## 30న సింగిల్ విండో సొసైటీ సర్వసభ్య సమావేశం

**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు గురువారం సీఈవో ఎడ్ల సతీష్ తెలిపారు. ఈనెల 30న గారెపల్లిలో గల సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు తోటపల్లి ప్రశాంత్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు సతీష్ పేర్కొన్నారు.

# దొరలను ఎదిరించిన ధీశాలి చాకలి ఐలమ్మ



## జానపద గిరిజన విజ్ఞాన పీఠం జయంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జానపద గిరిజన విజ్ఞానపీఠం, వరంగల్లు ప్రాంగణంలో పీఠాధిపతి ఆచార్య భూక్య బాబురావు అధ్యక్షతన చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకను పీఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య భూక్య బాబురావు మాట్లాడుతూ వరంగల్లు జిల్లా క్రిష్టాపురం గ్రామంలో చాకలి కులంలో జన్మించిన ఐలమ్మ తదనంతర కాలంలో విస్నూరులో దేశ ముఖ్, రజాకార్ల ఆరాచకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా చేపట్టిందని, దొరల పెత్తందారీ తనాన్ని ప్రశ్నించి దొరల గుండెల్లో బడ బాగ్నిలా నిలిచింది. దొరలకు ఎదురు తిరిగిన ఐలమ్మ కుటుంబాన్ని దొరలు నాశనం చేసినా ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏవిధంగా నష్టపెట్టగలడని తనలో తాను ప్రశ్నించుకొని 'నీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధైర్యంతో రోకలి బండ చేతబూని దొరకు సవాలు విసిరింది. ఈమె భూపోరాటం చలవతో మిగతా వారు వెంట రాగా దాదాపు 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి ఇవ్వడం జరిగిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీఠంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బాసని సురేష్, డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, అబ్బుగోపాల్ రెడ్డి, మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాటపటిమను కొనియాడుతూ వెనుకబడిన కులాల్లో ఇంతటి చైతన్యవంతురాలు ఎవరూ లేరని, ఈమె పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ సమాజంలో పీడింపబడుతున్న వెనుకబడిన కులాల్లో చైతన్యం కలిగించాలని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పీఠం సిబ్బంది డా.గంపా సతీష్, పరవస్తు విజయలక్ష్మి, నాసగోని ఆంజనేయులు, సుంకనపల్లి అశోక్, కస్తూరిబాయి తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖాధికారిగా ప్రభాకర్

### శుభాకాంక్షలు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండల విద్యాశాఖాధికారిగా తాళ్లపల్లి ప్రభాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్ కు మండల ఉపాధ్యాయ సంఘాలు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలుతెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఉపాధ్యాయ సమస్యల సాధనకై కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో వెంకటాపూర్ మండలాన్ని ములుగు జిల్లాలోని విద్య పరంగా ప్రథమ స్థానంలో ఉంచే విధంగా కృషి చేస్తామని తెలుపుతూ శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ టీయూ మండల అధ్యక్షుడు రాజయ్య, ప్రధాన కార్యదర్శి కమలాకర్, ఎస్ టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విష్ణు, టీటీయూ జిల్లా అధ్యక్షుడు సర్వర్ అహ్మద్, ఎస్సీ, ఎస్టీ జిల్లా అధ్యక్షుడు జనగాం బాబురావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి.రాధిక, చంద్రశేఖర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, వీరేందర్, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు వేల్పుకొండ రవీందర్, రాజిరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు సురేష్, సలేంద్రం, ఏడుకొండలు, రమేష్, మహేష్, అనిల్ కుమార్, శంకరయ్య, సమ్మయ్య, మక్బూల్ సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సోమిడి కరుణాకర్, కంప్యూటర్ ఆపరేటర్ నల్ల స్వాతి, ఐఆర్పీ గంగాధర్, సీఆర్పీలు కుమార్ పాద్య, గుగులోత్ దేవేందర్, అల్లం దేవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.




గడ్డం కేశవమూర్తి

# విరామం ఎరుగని విజయ భానుడు





**ఉవ్వెత్తున కొనసాగుతున్న తెలంగాణ ఉద్యమానికి ఆయన ఊపిరిగా నిలిచారు. కుట్రలు, కుతంత్రాలతో సాగుతున్న ఆంధ్ర పెత్తనంపై సమర శంఖారావం పూరించారు. ఆర్టీసీలోని అన్ని వర్గాలను ఐక్యం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. కార్మికులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా అందరినీ ఉద్యమ బాట పట్టించారు. తెలంగాణ బిడ్డగా భవిష్యత్ తరాలకు బాటలు వేశారు. ఆయనే ఆర్టీసీ ప్రస్తుత వరంగల్ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) దర్శనం విజయభాను.**

- **సిబ్బందే ఆయన బలగం**
- **తెలంగాణ ఉద్యమంలో సకల జనులకు తోడునీడ**
- **ఆర్టీసీ ఆస్తుల రక్షణకు ప్రత్యేక వ్యూహ రచన**
- **సీమాంధ్ర పాలకులకు చుక్కలు చూపిన నేర్పరి..**

ఒంటరి పోరాటం ఎప్పటికైనా వీగిపోతుంది.. అందరూ కలిసి చేసే ఉద్యమం తప్పకుండా ఫలితాన్ని తేల్చుతుందని గుర్తించిన ఆయన సకల జనుల సమ్మెకు వెన్నుదన్నుగా నిలిచారు. ఆర్టీసీ ఉద్యోగులందరినీ ఒక్కతాటిపైకి తేవడంతోపాటు ఉద్యమాన్ని ఉరకలు పెట్టించడంలో విజయభాను సఫలీకృతులయ్యారు. ఆయన ముందుచూపు, భిన్నమైన ఆలోచనల కారణంగా తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీకి ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెట్టాయి.

### తెలంగాణ ఆఫీసర్స్ అసోసియేషన్ కు ఆజ్యం..

కష్టాన్ని నమ్ముకుని.. ఇష్టంగా ముందుకెళ్లడంలో దర్శనం విజయభాను తనకు తానే సాటి అని చెప్పవచ్చు. చదువు రానివారు, ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్న వారంతా కలిసి నిర్వహిస్తున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాన్ని ఆదర్శంగా తీసుకున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను తెలంగాణ ఆఫీసర్స్ అసోసియేషన్ కు పురుడుపోశారు. మేరుగు సురేందర్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అసోసియేషన్ కు విజయ భాను ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి అన్ని విభాగాల్లోని ఉద్యోగులను ఒకే తాటిపైకి తెచ్చారు. వారిని చూసి సూపర్ వైజర్ల అసోసియేషన్ కూడా ఏర్పాటయ్యేలా ప్రేరేపించి అన్ని వర్గాల ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు, సిబ్బందిని ఉద్యమంలో మమేకమయ్యేలా జాగృత పర్చారు.

### ఉద్యమానికి కొత్త తొడుగు..

సీమాంధ్ర పాలకుల కుట్రలను దగ్గరుండి పసిగట్టిన విజయభాను ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి వ్యూహరచన చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ (తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్), అశ్వత్థామ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ), రాజిరెడ్డి (ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ), దేవీప్రసాద్, శివాజి, రాజిరెడ్డి (సింగరేణి) తదితరుల సహాయ సహకారాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. చరిత్రలోనే ఒక కార్పొరేషన్ ఉద్యోగుల సమ్మె 55 రోజుల పాటు ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా, ఎక్కడా శృతిమించకుండా సాగేలా ప్లాన్ చేసిన వారిలో విజయభాను కీలక పాత్ర పోషించారు. ఉద్యోగులు, కార్మికుల వంటి విభిన్న సెక్షన్ల వారు కలిసిమెలిసి కొనసాగేలా జాగ్రత్తలు తీసుకుంటూ సీమాంధ్ర పాలకుల కుట్రలను తిప్పికొట్టేందుకు సర్వ శక్తులు ఒడ్డారు.

### ఆస్తులు కాపాడడంలో కీలకం..

దర్శనం విజయభాను తనకున్న ముందుచూపుతో ఆర్టీసీని సీమాంధ్ర పాలకులు కొల్లగొట్టకుండా అడ్డుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తప్పకుండా రెండుగా చీలిపోతుందని ముందే పసిగట్టిన అప్పటి లీడర్లు, సీమాంధ్ర ఉద్యోగుల కుట్రలను విచ్ఛిన్నం చేశారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ ఆస్తులను కుదవపెట్టి, సీమాంధ్ర ఆస్తుల జోలికి వెళ్లకుండా అప్పులు పాలు చేయాలని చూసిన వారి కుయుక్తులను సోదహరణగా తేటతెల్లం చేసి, ఆధారాలతో సహా ముందుంచారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తమకు తాము సేఫ్ జోన్ లో ఉండొచ్చు., తెలంగాణ ఆర్టీసీని అప్పుల కుప్పలో నెట్టొచ్చని భావించిన వారి ఆగడాలను ఎండగట్టి, అదే విషయాన్ని పలువురు రాజకీయ నాయకుల అండదండలతో అప్పటి కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్, నితిష్ గడ్గరీ వంటి వారికి అర్థమయ్యేలా వివరించి రానున్న ఉపద్రవాన్ని వివరించారు. వారు సమర్పించిన లాజిక్కులు, నిజానిజాలతో ఏకీభవించిన అప్పటి కేంద్ర బాధ్యులు దిద్దుబాటుకు ఆదేశాలు జారీ చేశారంటే అది కేవలం విజయభాను లౌక్యమే అని చెప్పాలి. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి సీమాంధ్ర అధికారులు ఆంధ్రలోని కొన్ని ఆర్టీసీ ఆస్తులను కూడా కుదవ పెట్టించడంలో విజయభాను ప్రముఖ పాత్ర పోషించారు.






### బస్ భవన్ లో వాటా దక్కేలా..

హైదరాబాద్ లోని బస్ భవన్ తో సహా, ఇతర ఎనిమిది చోట్ల ఉన్న ఆర్టీసీ ఆస్తులను కొల్లగొట్టుకొని పోవడానికి సీమాంధ్ర పాలకులు చేసిన కుట్రలను విజయభాను తన సహోద్యోగుల సహకారంతో అడ్డుకున్నారు. తెలంగాణ ఆర్టీసీ వేల కోట్ల ఆదాయం కోల్పోతుందనే ప్రమాదాన్ని పసిగట్టి అడ్డుకట్టలు పడేలా పావులు కదిపారు. కానీ అప్పటి ఎండీ స్వార్థబుద్ధితో చేసిన ఒక్క సంతకపు పోటుతో ఆ సమస్య ఇంకా సాగుతూనే ఉంది. అయితే బస్ భవన్ లో మాత్రం వారికి వాటా దక్కేలా, మిగతావన్నీ తెలంగాణ ఆస్తులుగానే పరిగణించేలా ఆయన చేసిన ప్రయత్నం సఫలీకృతమైంది. ఐదారు వేల కోట్ల ఆస్తులు కొల్లగొట్టుకుని పోదామనుకున్న ఆంధ్ర వారి ఆశలను కేవలం ఆరేడు లక్షలకు కుదించేలా చేసి ఆర్టీసీ ఆస్తులు చేజారిపోకుండా చూశారంటే అది కేవలం విజయభాను అండ్ టీం తోనే సాధ్యమైంది.





## విద్యాభ్యాసం..

దర్శనం విజయభాను మాదన్నపేటలోని డీవీఎం అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఏడో తరగతి వరకు చదివారు. ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు హైదరాబాద్ సుల్తాన్ బజార్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. **1990**లో కోఠి ప్రగతి మహావిద్యాలయంలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. **1995**లోఉస్మానియా క్యాంపస్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశారు. ప్రైవేట్ సంస్థల్లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూనే, సాయంత్రం వేళ అంబేద్కర్ స్టడీ సర్కిల్ లో కోచింగ్ తీసుకున్నారు. జీవితంలో స్వయం కృషితో ఎదిగిన ఆయనకు **1999** లో ఏపీఎస్ ఆర్టీసీలో డిపో మేనేజర్ ఉద్యోగం లభించింది.

గడ్డం కేశవమూర్తి



## కుటుంబ నేపథ్యం..

హైదరాబాద్ సమీపంలోని మాదన్నపేటలో దర్శనం కలమ్మ–శివరాజ్ దంపతులకు **1974** ఏప్రిల్ **14**న విజయభాను జన్మించారు. ఆయన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. తల్లి గృహిణి. వీరికి అన్నా, తమ్ముడు, అక్క చెల్లెలు ఉన్నారు. **2005** ఆగస్టు **28**న ఉన్నత విద్యావంతురాలు వందనను వివాహం చేసుకున్నారు. కూతురు లీహ విజయ్, కుమారుడు విజయ్ లిఖిత్ ఉన్నారు. కుమార్తె ఇంటర్మీడియట్, కుమారుడు పదో తరగతి చదువుతున్నారు. సతీమణి వందన ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. విద్యార్థి దశలో విజయ భాను తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపవద్దని ఉద్దేశంతో.. పేపర్ బాయ్ గా పని చేశారు. ఆర్టీసీ బస్సుల్లో స్టూడెంట్ బస్సు పాస్ పై తిరుగుతూ విద్యార్థులకు ట్యూషన్ లు చెప్పారు. కొంతకాలం ప్రైవేట్ టీచరుగా పనిచేశారు. ఆయన శిష్యులంతా విభిన్న రంగాల్లో ఆర్థికంగా స్థిరపడ్డారు. చిన్నతనంలో గణితశాస్త్రం గురువు మంకాల క్రిష్ణారెడ్డి ప్రోత్సాహంతో విజయభాను అంచలంచెలుగా ఎదిగారు. లక్ష్యాల సాధనలో ఆయన ముందు వరుసలో నిలిచారు.



## ఉద్యోగ ప్రస్థానం..

1999 అక్టోబర్ 1న ట్రేనీ డిపో మేనేజర్ గా ఆర్టీసీలో జాయిన్ అయిన విజయ భాను నిజామాబాద్, కడప, భద్రాచలంలో శిక్షణ తీసుకున్నారు. 2001 జనవరిలో ఆదిలాబాద్ జిల్లా అసిఫాబాద్ లో డిపో మేనేజర్ గా మొదటి పోస్టింగ్ లభించింది. ఆయన అక్కడ మూడేళ్ల పాటు పనిచేశారు. తరువాత నాగర్ కర్నూల్ డిపోలో మూడేళ్లు, దిల్ షుక్ నగర్ డిపోలో మరో మూడేళ్లు మేనేజర్ గా బాధ్యతలు నిర్వహించారు. 2010 అక్టోబర్ 20న డీవీఎంగా విజయ భాను పదోన్నతి పొందారు. 2010 నుంచి 2012 వరకు హైదరాబాద్ డివిజన్ లో సేవలందించారు. మహబూబ్ నగర్ లో మూడేళ్లు, రంగారెడ్డి జిల్లాలో రెండేళ్లు డీవీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. 2017 నుంచి 2024 జూన్ రెండో వారం వరకు సనత్ నగర్, హయత్ నగర్, నిజామాబాద్, చార్మినార్ డివిజన్ లలో డివిజనల్ మేనేజర్ గా సమర్థవంతంగా ఆయన విధులు నిర్వర్తించారు.

2024 జూన్ 18న విజయభానుకు రీజినల్ మేనేజర్ గా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లాకు పదోన్నతి పై వచ్చిన ఆయన 2024 జూన్ 19 నుంచి ఆర్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ రీజియన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్–1, వరంగల్–2, పరకాల, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూర్ డిపోల పరిధిలో ఆర్టీసీ సేవలను మెరుగుపరిచారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆర్టీసీ మహాలక్ష్మి పథకాన్ని వరంగల్ రీజియన్ లో సంపూర్ణంగా అమలు చేస్తున్నారు. రోజురోజుకు ఓఆర్ శాతం పెంచుతున్న విజయభాను ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపిస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు, అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయ పరుస్తూ ప్రగతి పథంలో రీజియన్ ను పయనింప చేస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణికుల భద్రతకు ఆర్ఎం దర్శనం విజయభాను భరోసా కల్పిస్తున్నారు. అలాగే ప్రయాణికుల ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నిజాయితీగా సేవలందిస్తున్నారు.















WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, సెప్టెంబర్ 26, 2024

# నిర్ణయాధికారం వారిదే

**అడవిబిడ్డల అభివృద్ధికి సహకరించాలి**

**పెసా V/s ఫారెస్టు అన్నట్లు వ్యవహరించొద్దు**

**జాతీయ సదస్సులో మంత్రి సీతక్క**




**వరంగల్ వాయిస్, ములుగు :** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం గ్రామ సభలకు సంపూర్ణ అధికారాలు కట్టబెట్టాలని మంత్రి సీతక్క డిమాండ్ చేసారు. స్థానిక ఆదివాసీ గిరిజన ప్రజల అభివృద్ధి అవసరాల కోసం గ్రామ సభల్లో తీసుకున్న నిర్ణయాలు అమలయ్యేలా చూడాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల కనీస అవసరాలకు ఆటంకాలు కలిగించకుండా అటవీ, పర్యవరణ శాఖను సమన్వయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీతక్క విజ్ఞప్తి చేశారు. గురువారం న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్ నేషనల్ సెంటర్ లో షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయతీ చట్టాన్ని వర్తింప చేసే పెసా చట్టంపై జరిగిన జాతీయ సదస్సుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నిర్వహించిన సదస్సును ఆ శాఖ సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బఘేల్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పెసా చట్టం అమల్లో ఎదరవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సీతక్క ప్రసంగించారు.

## నిధులు విడుదల చేయండి..

ఎన్నికలు జరగలేదన్న కారణంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం ప్రభుత్వం నిలిపి వేసిన 15 వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బఘేల్ ను మంత్రి సీతక్క కోరారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని బఘేల్ దృష్టికి తీసుకెల్లారు. అయితే సీతక్క విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇదే రకమైన విజ్ఞప్తులు వస్తున్నందున, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇవ్వగా సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

## కేటీఆర్ కు చురకలు

పెసా జాతీయ సదస్సులో పాల్గొన్న అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో తనను కలసిన మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సీతక్క సమాధానమిచ్చారు. అమృత్ పథకం విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని కొట్టి పారేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ పథకంలో ఏమైనా తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందని, బీఆర్ఎస్ ఎందుకు తొందర పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. రేవంత్ రెడ్డి బంధువు అయినందునే సృజన్ రెడ్డికి అమృత్ టెండర్లు దక్కాయన్న విమర్శలు సరికావన్నారు. సృజన్ రెడ్డితో మీ ఇంటి ఆడపడుచు లిక్కర్ వ్యాపారాలు చేసినట్లు, కుంభకోణంలో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయని కేటీఆర్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. హైడ్రాతో పేద ప్రజలకు ఇబ్బందులు లేవని, ఇల్లు కోల్పోయే పేదలకు మరో చోట డబుల్ బెడ్ ఇండ్లు కేటాయిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు మంత్రి సీతక్క గుర్తు చేశారు.





# సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

**మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని నగర మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. 'స్వచ్ఛతా హి సేవా-2024' కార్యక్రమంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో పారిశుధ్య సిబ్బంది, సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్ లకు బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరం (హెల్త్ క్యాంప్) ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ లకు వైద్య పరిక్షలు నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణికి కమిషనర్ బీపీ చెక్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సీహెచ్ఓ రమేష్, టీపీఓ రాజేష్ గౌడ్, డీఎఫ్ఓ శంకర్ లింగం, బయలజిస్ట్ మాధవ రెడ్డి, ప్రతిమ ఆసుపత్రి డైరెక్టర్లు డాక్టర్ అవినాష్ తిప్పని, డాక్టర్ రాహుల్ నారాయణ్, క్లినికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సుచిత్ర తిప్పని, హెడ్, నెక్ సర్జరీ అంకాలజిస్ట్ డాక్టర్ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.



# నాలుగో రోజు ఘనంగా బొడ్డెమ్మ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని రంగసాయపేట 42వ డివిజన్ ఆదర్శనగర్ ఉర్సు రోడ్డులో చీకటి సరోజన నివాసంలో నాలుగో రోజు గురువారం బొడ్డెమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ బొడ్డెమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు చీకటి సరోజన, ఇటికాల సంధ్యారాణి, చిట్ల ఉషారాణి, చిట్ల సంధ్యారాణి, మిట్టపెల్లి రమాదేవి, పేరాల పుష్ప, వంచనగిరి కరుణశ్రీ, బంగారి సుమలత, కౌటం సరస్వతి, శంకేసి చిన్న రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో టాస్క్ ఫోర్స్ దాడులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరంలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్న వ్యాపారస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్న వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ జా ఆదేశాల మేరకు గురువారం టాస్క్ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో వరంగల్ లోని పలు బేకరీలపై దాడులు నిర్వహించారు. వరంగల్ నగరంతోపాటు జిల్లా నలుమూలలకు బేకరీ ఐటంలు సరఫరా చేస్తున్న సంతోష్ కుమార్ కిరాణం, జనరల్ స్టోర్ లో వరంగల్ టాస్క్ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఇంతేజార్గంజ్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో పెద్ద మొత్తంలో నాసిరకం, కాలం చెల్లిన బేకరి ఐటమ్ లను గుర్తించారు. వీటి విలువ రూ.8లక్షల పైనే ఉంటుందని వివరించారు. విచారణ నిమిత్తం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సమక్షంలో ఇంతేజార్ గంజ్ పోలీసులకు అప్పగించారు.

# రోజుకో ప్రకటన

- **అయోమయంలో ఆశావాహులు**
- **కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు**
- **తొలుత సెప్టెంబర్ 17, తర్వాత అక్టోబర్ 2 నుంచి అంటూ ప్రచారం**
- **తాజాగా డిజిటల్ కార్డులంటూ ప్రకటన**

**వరంగల్ వాయిస్, మల్లూర్ :** పేదల జీవితాల్లో రేషన్ కార్డుకి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంత కాదు. ప్రభుత్వం నుంచి వచ్చే ఏ సంక్షేమ పథకం అయినా సరే రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారునికి చేరుతుంది అనడానికి గత నెలలో జరిగిన రుణ మాఫీ ప్రక్రియే నిదర్శనం. రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా రుణ మాఫీ జరగగా రేషన్ కార్డు లేని వారి విషయంలో పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి, మహా లక్ష్మి, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకానికి కూడా రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకోవడంతో రేషన్ కార్డు లేని పలువురు గృహ జ్యోతి, మహా లక్ష్మి పథకానికి అర్హత కోల్పోయారు. అంతటి ప్రాముఖ్యం ఉన్న రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వ ప్రకటనలు సామాన్య ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాయి.

## చేర్పులు, మార్పులకు నో ఛాన్స్..

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో అతి తక్కువ సంఖ్యలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తర్వాత వాటి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. చేర్పులు, మార్పులకు సైతం ఎటువంటి అవకాశం ఇవ్వక పోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల సమయంలో అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామంటూ చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా రేషన్ కార్డుల జారీ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం పలు విమర్శలకు తావు ఇస్తోంది.



## స్పష్టత కరువు..

తాజాగా రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం పౌరసంబంధాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడంతో పలువురు లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. కానీ రేషన్ కార్డులపై రోజుకో ప్రభుత్వ ప్రకటన ప్రజలను అయోమయానికి గురి చేస్తోంది. తొలుత సెప్టెంబరు 17 వ తేదీ నుంచి 10 రోజుల పాటు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి కొత్త రేషన్ కార్డుకోసం దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా ఎటువంటి ఏర్పాట్లు జరగలేదు. వారం రోజుల కిందట ప్రభుత్వం అక్టోబర్ 2వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పినప్పటికీ వాటి విషయంలో ఇప్పటి వరకు స్పష్టమైన మార్గదర్శకాలు రాకపోవడంతో పలువురు ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరిస్తే అది మీసేవ కేంద్రాల ద్వారా ఆన్ లైన్ లో స్వీకరిస్తారా లేదా మళ్ళీ ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ఆఫ్ లైన్ లో స్వీకరిస్తారా అనేది స్పష్టత లేకుండా పోయింది. మరోవైపు ఇప్పటికే పెండింగ్ లో ఉన్న దరఖాస్తులపై ఎటువంటి ప్రకటన లేదు. పెండింగ్ దరఖాస్తులు పరిశీలించి ఆమోదిస్తారా లేక మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలా అన్న విషయంలో స్పష్టమైన ప్రకటన లేదు.

## డిజిటల్ కార్డు అంటూ మరో ప్రచారం..

ఇది ఇలా ఉండగా తాజాగా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు మంజూరు చేస్తామని రేషన్ తో సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇదే ప్రామాణికం అని ప్రకటించడంతో వచ్చే అక్టోబర్ 2 నుంచి స్వీకరించే రేషన్ కార్డుల దరఖాస్తులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కొత్త రేషన్ కార్డుల జారీ, పెండింగ్ దరఖాస్తుల విషయంలో స్పష్టమైన ప్రకటన చేసి ప్రజల్లో రేషన్ కార్డులపై నెలకొన్న అపోహలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com